## దరఖాస్తుల ఆహ్వానం

వనస్థలిపురం, జనవరి 21 : తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ షేక్ హబీబ్ ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9182628275, 7702858048 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 21 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్-8 డీఈ టి. విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జోరాభీ దర్గా ఫీడర్ పరిధిలో ఉదయం 10 . 30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ కుమ్మరివాడీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4. 30 గంటల వరకు ఆయా ప్రాంతాలతోపాటు పరిసరా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## బీఆర్‌ఎస్ నేతల అరెస్టు



బీఆర్‌ఎస్ నేత అర్కల కామేశ్ రెడ్డిని గృహనిర్బంధం చేసిన మీర్‌పేట పోలీసులు

బడంగ్‌పేట,జనవరి21: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ వార్డులలో నిర్వహించే వార్డు సభలలో అధికారులను ప్రశ్నిస్తార్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ నేతలను అరెస్టులు చేయడం, గృహనిర్బంధం చేస్తున్నారని బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అరెస్టులు చేయిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం బండారం బయట పెడుతారోనని భయపడి అరెస్టులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు పాలన కొనసాగిస్తుందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన చేయడం సిగ్గుచేటన్నారు. వార్డు సభలు ఎందుకు పెట్టారో చెప్పాలన్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. చేత కాని హామీలు ఇచ్చి ఎందుకు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటే పదుల సంఖ్యలో కూడా లబ్ధి దారులు లేరన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన వారి పేర్లు మాత్రం ఎంపిక చేసినట్లు తెలుస్తుందన్నారు. ఎన్ని సార్లు అరెస్టు చేసినా ప్రజల పక్షాన నిలదీస్తామన్నారు.

# గ్రామసభల్లో గందరగోళం

- అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు
- లబ్ధిదారులను గుర్తించడంలో విఫలం
- ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలని అధికారులను నిలదీసిన ప్రజలు
- బీఆర్‌ఎస్ నేతలకు ఫోన్లు చేసి బెదిరించిన పోలీసులు



మహేశ్వరం మండలం గొల్లూరులో నిర్వహించిన గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

బడంగ్‌పేట, జనవరి21: మహేశ్వరం మండలంలోని గొల్లూరు, కల్వకోలు, దుబ్బచర్ల, అమీర్‌పేట, రావిర్యాలలో నిర్వహించిన గ్రామ సభలు గందరగోళంగా మారాయి. ఎక్కడికి అక్కడ ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజలు నిలదీస్తారన్న సమాచారంతో గ్రామ సభల దగ్గర పోలీసు బందో బస్తు మధ్యన గ్రామ సభలు నిర్వహించ వలసిన దుస్థితి ఏర్పడింది. గ్రామ సభలలో కాంగ్రెస్ హామీలను నెర వేర్చాలని బీఆర్‌ఎస్ నేతలు అధికారులను ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో పోలీసులు ఫోన్లు చేసి బెదిరించినట్లు నేతలు పేర్కొంటున్నారు. గ్రామ సభల దగ్గరకు వచ్చి లొల్లి చేస్తే కేసులు నమోదు చేస్తామని ముందే వార్నింగ్ ఇచ్చి న్నట్లు బీఆర్‌ఎస్ నేతలు వాపోయారు. ప్రజలు మాత్రం గ్రామ సభలలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగి పడేస్తున్నారు. ఎన్ని సార్లు దరఖాస్తులు ఇవ్వాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమైపోయాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గొల్లూరు గ్రామంలో ఐదు వందల మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకుంటే కేవలం 20 మంది పేర్లు ఎలా వస్తామని అధికారులను నిలదీశారు. అధికారులు ఎంపిక చేసిన 20 మందిలో ఎవరు నిజమైన లబ్ధి దారులేరన్నారు. రేషన్ కార్డుల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నామన్నారు. మరోసారి దరఖాస్తులు చేసుకోమంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి రాకపోవడం పై ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కల్వకోలు, దుబ్బచర్ల, అమీర్‌పేట, రావిర్యాలలోను అదే పరిస్థితి నెలకొన్నది. నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ప్రజలు మండి పడుతున్నారు. వందలలో దరఖాస్తులు చేసుకుంటే పదులలో పేర్లు ఎలా వస్తాయని నిలదీస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతి సారి దరఖాస్తులు చేసుకోవాలని కాలయాపన చేస్తున్నారన్నారు. అన్ని ఉన్న వారికి మరోసారి అవకాశం కల్పిస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ ఇప్పటికి కాలేదన్నారు. దరఖాస్తులు చేసుకోని వారి పేర్లు వచ్చాయన్నారు. అధికారులు పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారన్నారు. రుణమాఫీ చేస్తామని చేయలేదని అన్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పకుండా దాట వేత ధోరణి అవలంభించడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీడీవో శైలజా రెడ్డి, తుక్కుగూడ కమిషనర్ వాణి రెడ్డి, మేనేజర్ పర్వతాలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్



సైదాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఆర్‌ఏఎఫ్ పోలీసులు

సైదాబాద్, జనవరి 21 : శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజల్లో భరోసా కల్పించటానికే ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహిస్తున్నామని సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్న నాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సూచనల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాబాద్ డివిజన్ పరిధిలో సున్నితమైన, అతి సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తోపాటు సైదాబాద్ పోలీస్ స్టేషన్ పోలీసులు, ప్రత్యేక పోలీసులతో కలిసి ప్రధాన రోడ్లపై కవాత్ చేశామని తెలిపారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిచేందుకు క్షేత్రస్థాయిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘువేందర్, డీఐ ఆనంద్‌కుమార్, ఆర్‌ఏఎఫ్ కమాండెంట్లు, స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జనవరి 21 : నగర శివారు ప్రాంతమైన హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఆయా కాలనీవాసులతో ఎంపీ ఈటెల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతమైన హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఆయన వెంట హయత్‌నగర్ డివిజన్ పలు కాలనీవాసులు ఉన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లింగోజిగూడ డివిజన్ వాసులు

చంపాపేట, జనవరి 21: ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజుల బకాయిలు చెల్లించాలని విద్యార్థులను మనస్థాపానికి గురి చేస్తున్నాయని పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ లింగోజిగూడ డివిజన్‌కు చెందిన పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల సంయుక్తంగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ వెంటనే స్పందించి విద్యార్థులను ఇబ్బందిపెడితే విద్యా సంస్థలపైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రవీణ్‌రెడ్డి, పల్సం శ్రీధర్‌గౌడ్, శ్రీనాథ్‌రావు, రోహిత్, నరేందర్ పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు వివేకానందుడు

రవీంద్రభారతి, జనవరి 21 : యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన సన్మార్గంలో నడువాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణామోహన్‌రావు అన్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉజ్వల సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి వివేకానంద స్ఫూర్తి అవార్డ్స్ ప్రదానోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. వక్తలుగా డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు విచ్చేసి విశిష్ట సేవలందించిన వారికి అవార్డ్సను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానందుడు గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని ఆయన ఉపన్యాసాలు, రచనల ద్వారా భారతీయ సంస్కృతి, వేదాంతం యోగాలను ప్రపంచానికి పరిచయం చేశారని కీర్తించారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 21: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)మంగళవారం విద్యానగర్-కాచిగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. సిమెంట్ రంగు టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 8712568495లో సంప్రదించాలని కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

మలక్‌పేట, జనవరి 21: ట్రాఫిక్ నియమాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సురక్షిత ప్రయాణాల కోసం ట్రాఫిక్ నియమాలను పాటించాలని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019లపై ఆయన విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మైనర్ డ్రైవింగ్‌లు, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు ఎక్కువయ్యాయని మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ప్రమాదకరంగా వాహనాలు నడిపే ముందు ఒక్కసారి మీ కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్లో వెళ్లటం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడపటం, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపటం వంటివి అన్ని ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కిందకే వస్తాయని, చట్టరీత్యా నేరమని ఆయన వివరించారు. సెల్‌ఫోన్లలో సంభాషిస్తూ అనేకమంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వేగంకన్నా, ప్రాణం మిన్నా అని, ఎంత తొందరగా చేరుకున్నామన్నది ముఖ్యంకాదని, ఎంత సురక్షితంగా చేరుకున్నామన్నదే ముఖ్యమని ఆయన తెలిపారు. స్పీడ్ థ్రిల్ నిస్తుందని, కాని కిల్ కూడా చేస్తుందన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా రోడ్డు ప్రమాదాల బారినపడి విలువైన ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారని అన్నారు. ప్రమాదరహిత ప్రయాణాలు కొనసాగించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు రాము, సీహెచ్.రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కులన్నింటినీ అభివృద్ధి చేశా



సీఈ కాలనీలో పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జనవరి 21: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని పార్కులను అందంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ పార్కులో రూ.6 లక్షలతో చేపట్టనున్న మరమ్మతు, సుందరీకరణ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు, నల్లకుంటలోని మోత నాగేశ్వర్‌రావు పార్కు, నరేంద్ర పార్కు, గోల్నాకలోని తులసీనగర్ కాలనీ పార్కు, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సోమసుందర్‌నగర్ పార్కు, వైభవ్‌నగర్ పార్కులను సుందరీకరించినట్లు పేర్కొన్నారు. వీటి అభివృద్ధికి కొన్ని కోట్లు వెచ్చించడం జరిగిందని అన్నా రు. అలాగే సీపీఎల్ రోడ్డును కూడా సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఫీవర్ హాస్పిటల్ బ్రిడ్జి వద్ద రెండు వైపుల కూడా అందంగా తయారు చేశామన్నారు. పా ర్కులనే కాకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి పడాల వెంకట్రావు, కోశాధికారి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్‌రావు, ప్రతినిధులు సత్యం, నాగేశ్వర్‌రావు, పార్థసారిథి, సాంబమూర్తి, సంగీత, ఉషా, శైలజ, మోనరిలేకర్, జ్యోతిరెడ్డి, జ్యోతిర్లత, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్,తదితరులు పాల్గొన్నారు.

# జాబితాలో పేర్లు లేవు



పులిమామిడిలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి



గ్రామసభలో మాట్లాడుతున్న హయత్‌నగర్ తహసీల్దార్ జానకి

కందుకూరు, జనవరి 21 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పెద్దమ తండా, దావుద్‌గూడ తండా, రాచులూరు, పులిమామిడి, గూడూరు, అన్నోజిగూడ, బేగరికంచ, మీర్‌ఖాన్‌పేట్, గుమ్మడవెల్లి, కొలనుగూడ, దాసర్లపల్లి, బాచుపల్లి, బేగంపేట్ గ్రామల్లో గ్రామ సభలను నిర్వహించారు. పులిమామిడి గ్రామ సభలో ఎంపీడీవో సరితతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లు లేనటువంటి వారు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కాగా 13 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన క్లస్టర్ అధికారులు గోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి, లావణ్య, గీత, రవీందర్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి,శారద పాల్గొన్నారు.

### అధికారులతో కలిసి..

హయత్‌నగర్: మండల పరిధిలోని అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అమలు చేస్తామని హయత్‌నగర్ తహసీల్దార్ జానకి తెలిపారు. మంగళవారం హయత్‌నగర్ వార్డు కార్యాలయంలో బాగ్ హయత్‌నగర్, అనమగల్ హయత్‌నగర్, ఖల్సా హయత్‌నగర్ పరిధిలోని రైతులతో తహసీల్దార్ జానకి, సంబంధిత అధికారులతో కలిసి గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ గ్రామాల్లో రైతు భరోసా పథకం అమలు చేయడానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. అగ్రికల్చర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతుల జాబితాను ప్రదర్శించారు. ఈ సమావేశంలో అగ్రికల్చర్ ఏఓ సోలామన్ నాయక్, రెవెన్యూ మండల సీనియర్ అసిస్టెంట్ శ్వేత, ఆర్ఐలు ఆర్.నరసింహ యాదవ్, రమేశ్, రెవెన్యూ సిబ్బంది వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

### తూతూ మంత్రంగా గ్రామసభలు..

బడంగ్‌పేట: బాలాపూర్ మండలంలోని మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లలో, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించిన వార్డు సభలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు సభలు పెట్టాలి కనుక తూతూ మంత్రంగా సభలు నిర్వహించి తమ పని అయిపోయిందని అధికారులు చేతులు దులుపు కున్నారు. మీర్‌పేట, బడంగ్‌పేటలో ఎక్కడ కూడ పెద్దగా వార్డు సభలకు ప్రజలు కన్పించ లేదు. ఓ గంటసేపు సభ నిర్వహించి అధికారులు వెళ్లిపోయారు.లిస్టులో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. మరో సారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. దీంతో అధికారులకు ప్రజల వాగ్వాదం చోటు చేసుకుంది. నిజమైన లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికార పార్టీ వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. సాధారణ ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు పెట్టుకుంటే ఎవరికి రాక పోవడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై స్థానికులు మండి పడుతున్నారు. నిజమైన లబ్ధి దారులను గుర్తించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దీప్‌లాల్ చౌహాన్, బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్లు ఆర్ జ్ఞానేశ్వర్, సరస్వతి, అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, నాగేశ్వర్, వేణుగోపాల్ రెడ్డి,కార్పొరేటర్లు పాల్గొన్నారు.




బడంగ్‌పేటలో నిర్వహించిన గ్రామసభ లో దరఖాస్తులు తీసుకుంటున్న మేయర్, ప్రజాప్రతినిధులు

## అమర శిల్పి జక్కన, విశ్వశిల్పి రామప్ప పురస్కారాలు ప్రదానం



అవార్డులు పొందిన వారితో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

రవీంద్రభారతి, జనవరి 21 : విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం, జాతి ఔన్నత్యాన్ని విలువలను పరిరక్షించాలని శాసనమండలి ప్రతిపక్షనేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అ న్నారు. సంఘం కార్యాలయంలో ప్రతి ఏటా సంఘం అందజేస్తున్న ప్రతిష్టాత్మక సుప్రసిద్ధ అమర శిల్పి జక్కనాచార్యపురస్కారం, విశ్వశిల్పి రామప్ప పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు, రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షుడు పులిగిళ్ల శ్రీనివాసాచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ వీరాచారి, రాళ్లబండి విష్ణుచారి విచ్చేసి పలువురికి పురస్కారాలను అందజేసి సత్కరించారు. వీణవంక సదానందంకు విశ్వశిల్పి రామప్ప పురస్కారం, మంజంపెల్లి సోమ బ్రహ్మ నరసింహాచారికి అమరశిల్పి రామప్ప పురస్కారం, కాశ అంజయ్యాచారి, కనపర్తి రామరత్నమాచార్యులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

## శివారు కాలనీల అభివృద్ధికి సహకరించాలి



గాయత్రీనగర్ బ్యాంక్ కాలనీలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 21 : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీల అభివృద్ధికి సహకరించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో సమస్యలను అధికారుల దృష్టికి తీసకువెళ్లామన్నారు. చాలా పనులను ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. వాటిని పరిష్కరించాలని సూచించారు. సాహెబ్‌నగర్ కమ్యూనిటీ హాల్, మహిళా సంక్షేమ భవనాలకు మరమ్మతులు చేయాలని కోరారు. బ్యాంక్ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. శ్మశాన వాటిక రహదారిని శుభ్రం చేయాలన్నారు. కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించిన అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలి

కాచిగూడ,జనవరి 21: రాష్ట్రంలోని బీసీలకు ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలని కోరుతూ మంగళవారం కాచిగూడ టూరిస్ట్ హోటల్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 54 శాతం ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను తక్షణమే ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చాడని, వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో పూలిజాల కృష్ణ, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ తదితరులు